క్లుప్తంగా

మండల అభివృద్ధికి కృషి



నూతన ఎంపీడీఓకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఉద్యోగులు

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూతన ఎంపీడీఓ ఎస్.విజయ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన సందర్భంగా గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని పదిహేను గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించడంతో పాటు పెండింగ్ పనులను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ అందించడంతో పాటు సమస్యలను పరిష్కరించడంతో పాటు విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లా దోర్నాల ఎంపీడీఓగా పనిచేస్తూ చీరాలకు బదిలీ అయ్యానని చీరాల్లో తన మార్క్ పనితీరు చేస్తానని తెలిపారు. కార్యాలయ ఉద్యోగులు, పలువురు కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించారు.

కొండమంజులూరు విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన కొండమంజులూరు విద్యార్థులు

జె.పంగులూరు: మార్టూరు మండలం కోలలపూడిలో జరిగిన బుధవారం జరిగిన డివిజనల్ ఆటల పోటీల్లో కొండమంజులూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా స్థానిక కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజన్ నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎంఐ అనిత అభినందించారు. జిల్లా స్థాయిలో సెలక్ట్ అయిన వారిలో ఖోఖో విభాగంలో అండ్ –17 లో జాన్‌బాబు, చొప్పరపు నవీన్ ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్ 14 విభాగంలో పల్లెపు రమ్య జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు హనుమయ్య, గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

వాలీబాల్ జట్ల ఎంపిక నేడు

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం అండర్–19 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. చింపారెడ్డి గురువారం తెలిపారు. ఆసక్తి కలిగి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎస్ఎస్‌సీ ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డును తమ వెంట తీసుకురావాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

అద్దంకి రూరల్: అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను గురువారం అద్దంకి సీఐ సుబ్బరాజు కేసులు నమోదు చేసి అద్దంకి కోర్టుకు హాజరు పరిచారు. న్యాయమూర్తి అఖిల ఒక్కొక్క వాహనదారుడికి రూ. 3 వేలు చొప్పున 9 వేలు జరిమానా విధించారు.

న్యాయమూర్తిపై బూటు విసరడం బాధాకరం

బల్లికురవ: సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది కిషోర్ తన కాలి బూటు విసరడం అత్యంత బాధాకరమని ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పత్తిపాటి నాగయ్య మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై జరిగిన ఈ దాడిని నిరసిస్తూ గురువారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు తహసీల్దార్ రవినాయక్‌కు కిశోర్‌ను శిక్షించాలని వినతి పత్రం అందజేశారు. న్యాయమూర్తి దళితుడనే ఈ దాడికి తెగబడ్డారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సురభి రామారావు, ప్రభాకర్, జండ్రాజుపల్లి రవి, నాగయ్య, అశోక్, బండారు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

చీరాల టౌన్: తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అనిచెప్పి నమ్మకంగా ఓట్లు వేయించుకునే సీఎం చంద్రబాబు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని మాజీ ఎంపీ చిమటా సాంబు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్రం సహకరించకపోయినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తానని ప్రకటించడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబుకు కాలయాపన చేస్తే ఓటుతో బుద్ధి చెపుతామని పేర్కొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్త

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యురాలు పావని అన్నారు. గురువారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు.

ఊరంతా నీరే!



చెన్నుపల్లి నుంచి కొండాయపాలెం వెళ్లే రోడ్డులో డౌన్ చప్టాపై ప్రవహిస్తున్న నీరు



ప్రాథమిక పాఠశాల చుట్టూ వర్షపు నీరు



జారుడుబల్లను తలపిస్తున్న మల్లయపాలెం- కొండాయపాలెం రోడ్డు

- వర్షం పడితే కొండాయపాలెంవాసుల విలవిల
- గ్రామంలోకి వెళ్లే రహదారి అధ్వాన స్థితి
- బస్సు ఎక్కాలన్నా రెండున్నర కిలోమీటర్లు నడవాల్సిందే..
- పట్టించుకోని పాలకులు.. అధికారులు

బల్లికురవ: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బల్లికురవ పంచాయతీలోని కొండాయపాలెంలో రెండు వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. కొద్దిపాటి చినుకు పడినా గ్రామంలోకి వెళ్లే పరిస్థితి లేదు. చెన్నుపల్లి- అనంతవరం ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లాల్సి ఉంటుంది. అయితే చెన్నుపల్లి- కొండాయపాలెం గ్రామాల మధ్య ఉన్న డౌన్ చప్టాపై వర్షపు నీరు, చెరువు పొలాల నుంచి వచ్చే నీరు మూడు అడుగుల మేర ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మరోవైపు మల్లయపాలెం నుంచి గ్రామంలోకి వచ్చే తారు రోడ్డు గ్రానైట్ వాహనాల దెబ్బకు మట్టి రోడ్డుగా మారిపోయింది.

పాఠశాలలోకి వెళ్లేదెలా?

గ్రామం చివర్లో ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ఉంది. అంగన్‌వాడీలో 60 మంది వరకు చిన్నారులు ఆటపాటలతో విద్యనభ్యసిస్తున్నారు. కొద్దిపాటి వర్షం పడినా ప్రధాన రహదారి నుంచి పాఠశాలలోకి వెళ్లే దారిని వర్షపు నీరు పూర్తిగా కమ్మేస్తోంది. నాలుగు నుంచి అయిదు అడుగుల ఎత్తు వరకు నీటి ప్రవాహం ఉండటంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. దీంతో చిన్నారులను గ్రామంలోకి వచ్చే బస్సులు, వ్యాన్లలో ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు

గ్రామం చుట్టూ క్వారీలు

గ్రామం చుట్టూ గ్రానైట్ క్వారీలు తలనొప్పిగా మారాయి. రెవెన్యూ, పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామ అభివృద్ధికి పాటుపడుతామనిగ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు చెప్పడమే కానీ.. ఆ దిశగా అడుగులు వేయడంలేదు. అలాగే చెన్నుపల్లి – అనంతవరం ఆర్ అండ్‌బీ రోడ్డుకు తూర్పు పడమర భాగాల్లోనే గ్రామం విస్తరించి ఉంది. మురుగు కాలవలు సక్రమంగా లేకపోవడంతో మురుగు దెబ్బకు దోమల దాడి అధికమైందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాలపై ఎంపీడీఓ కుసుమ కుమారిని వివరణ కోరగా ప్రధాన రోడ్డు ఆర్అండ్‌బీ ఆధీనంలో ఉందని.. మురుగు కాలవలు నిర్మాణం చేపట్ట లేమన్నారు. అంతర్గత రోడ్లను గ్రామ పంచాయతీ నిధులతో దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

వైవీని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



వైవీ సుబ్బారెడ్డితో వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల అర్బన్: టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ చీరాల నాయకులు గురువారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు ఆదేశాల మేరకు చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయి నుంచి నాయకుల్ని తీర్చిదిద్దే కార్యక్రమాలపై ఆయన పార్టీల నాయకులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు యాతం మేరిబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవరావు, వేటపాలెం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం మహేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



స్వర్ణ గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రదీప్ కుమార్

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు క్రమం తప్పకుండా మీ సమీప ఆరోగ్య కేంద్రాల్లో తప్పకుండా అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ డి. ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం స్వర్ణ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన గర్భిణుల వైద్య పరీక్షల్లో పాల్గొని వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సలహాలను అందించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రతి ఒక్కరూ మూడో నెలలోనే మీ ప్రాంత ఆశాలు, ఏఎన్ఎంల వద్ద మీ పేరు, ఊరు, అడ్రెస్, కాన్పు, వైద్య పరీక్షల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. అప్పటి నుంచి వైద్య సిబ్బంది మీకు అందుబాటులో ఉంటూ మీకు అవసరమైన అన్ని ఇంజక్షన్లు చేస్తూ ఇంకా అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయిస్తారన్నారు. ముఖ్యంగా రక్తహీనతతో ఇబ్బందులు పడే వారిని గుర్తించి వారిని హైరిస్క్ గర్భిణుల లిస్టులో నమోదు చేసి అవసరమైన పరీక్షలు చేస్తారన్నారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. మీ బ్లడ్ గ్రూప్‌కు తగిన రక్త నిల్వలు కూడా అందుబాటులో ఉంచుతారన్నారు. సుఖ ప్రసవం వరకు మీకు అవసరమైన అన్ని సేవలందిస్తారన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 26 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. హెచ్ఈ మాధవీ, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్, స్టాఫ్‌నర్స్‌లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు తక్కువ ధరకే మెరుగైన వైద్య సేవలు



పన్నులు తగ్గింపుపై సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి దాసరి చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): జీఎస్టీ తగ్గింపుతో పేదలకు తక్కువ ధరకే మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వల్ల వైద్య ఆరోగ్య రంగంలో అన్ని రకాల మందులు, ఆక్సిజన్ సిలిండర్‌లు, పరీక్ష పరికరాలు, జీవిత, ఆరోగ్య బీమాలపై పన్నుభారం తగ్గిందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు తక్కువ ధరలో అందుబాటులోకి వచ్చాయన్నారు. దాంతో పాటు నిత్యావసర సరుకులు వస్తువులు, మోటారు వాహనాలపై కూడా పన్నుభారం తగ్గుతుందని అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా కంటి పరీక్షలు చేయించుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలన్నారు. కంటి పరీక్షలు, కంటి అద్దాలు, బ్రెయిలీ పుస్తకాలపై కూడా పన్నుభారం తగ్గిందని వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైదన సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



కేవీ పాలెంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వస్తున్న అశోక్ కుమార్

బల్లికురవ: వైదన గ్రామ పంచాయతీ సర్పంచ్ మేడా జయలక్ష్మి గుండెపోటు సంభవించి అకాల మరణం చెందటం బాధాకరమని అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. గురువారం రాత్రి ఇటీవల చనిపోయిన వైదన సర్పంచ్ జయలక్ష్మి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కరోనా సమయంలో జయలక్ష్మి భర్త పెద అంజయ్య చనిపోయారని ఆబాధ నుంచి కోటుకుంటున్న సమయంలో సర్పంచ్ చనిపోయి తమను దిగ్భ్రాంతికి గురిచేశారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మేడా శివదుర్గా, బొమ్మిశెట్టి బ్రహ్మయ్య, గుంజి దానయ్య, నక్కా పార్వతి, గాలం అంజయ్య, కాసా రాంబాబు, అశోక్‌కుమార్‌కు వివరించారు. అంతకు ముందు అద్దంకి, పాతమాగులూరు, కొమ్మినేనివారిపాలెం, కూకట్లపల్లి జమ్ముల మడక, గ్రామాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో అశోక్ కుమార్ పాల్గొన్నారు. మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, యూత్ అధ్యక్షుడు మక్కెన రవిబాబు, రైతు, బీసీ, ఎస్సీసెల్ అధ్యక్షుడు మేడగం శ్రీనివాసరెడ్డి, ఎ. సతీష్, ప్రత్తిపాటి అక్కయ్య వివిధ గ్రామాల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపీకి వినతులు

చీరాల రూరల్: ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో గురువారం పాల్గొన్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రాలు అందించారు. వైద్యశాలలో పనిచేస్తున్న 23 మంది పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదంటూ కార్మికులు వినతి పత్రం అందించారు. వైద్యశాలలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ తమకు సమానపనికి సమాన వేతనం ఇవ్వడంలేదని, పీఎఫ్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయడంలేదని, రిస్క్ అలవెన్సులు, గ్రాట్యుటీ వంటివి అమలు చేయడంలేదని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ. రుక్మిణి, సిబ్బంది ఏసురాజు, మణికంత, కరుణామయుడు, ఉష, షారోన్‌లు ఎంపీకి వినతి పత్రం అందించారు.

డ్రగ్స్ వినియోగంతో జీవితాలు నాశనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల అర్బన్: డ్రగ్స్ వినియోగం వలన యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని, వాటి బారిన పడకుండా అవగాహన కల్పించడం ఎంతో అవసరమని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. ఈగల్ చీఫ్ ఆర్కే రవికృష్ణ ఆదేశాల మేరకు ఎస్పీ ఉమామహేశ్వర్ సూచనలతో బాపట్ల ఈగల్ సెల్, చీరాల సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో గురువారం చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో డీఎస్సీలో ఎంపికై శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు డ్రగ్స్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే ప్రమాదాలు, విద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి ఉపాధ్యాయులకు వివరించారు. డ్రగ్స్ శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతన మాత్రమే కాకుండా కుటుంబాలను కూడా దెబ్బతీస్తుందన్నారు. యువతలో ఆసక్తి, స్నేహితుల ఒత్తిడి వంటి కారణాల వలన ఈ వ్యసనం బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులుగా తమ భవిష్యత్తు బాధ్యత ఎంత ముఖ్యమో వారికి సూచించారు. విద్యార్థులకు చిన్న వయస్సు లోనే డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. తరగతి గదిలో ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించి, అవసరమైతే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించి వారు భయపడకుండా తమ సమస్యలను చెప్పుకునేలా చూడాలన్నారు. సమాజం, తల్లిదండ్రులు, అధికారులు కలిసి పనిచేస్తేనే డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న 189 మంది ఉపాధ్యాయులు తాము భవిష్యత్తులో విద్యార్థులకు సరైన దారి చూపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎంఈఓ పురుషోత్తం, రూరల్ సీఐ శేషగిరి రావు, శక్తి టీం ఎస్సై హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిజమైన అంబేడ్కర్ వారసుడు కాన్షీరాం



కాన్షీరాం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

చీరాల రూరల్: నిజమైన అంబేడ్కర్ వారసుడు కాన్షీరాం అని ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి రాజ్యాధికారాన్ని స్థాపించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. కాన్షీరాం 19వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఎన్. భగత్‌సింగ్, నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ మాట్లాడారు. కాన్షీరాం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రచేసి ప్రజలన చైతన్యం చేసి దేశంలో అతిపెద్ద రాష్ట్రంలో నాలుగుసార్లు ముఖ్యమంత్రిని చేశాడని చెప్పారు. నాయకులు కుంచాల పుల్లయ్య, యాతం విజయ్, బోయేజు, తేళ్ల లక్ష్మయ్య, చుండూరి వీరయ్య, దుద్దు పుల్లయ్య, ఆదాము, జోసఫ్, ఏలియ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలి

- ఐఎల్‌టీడీ కంపెనీ మేనేజర్ శ్యాంసుందర్
- ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

చీరాల రూరల్: విద్యార్థులు కష్టంతో కాకుండా క్రమశిక్షణతో ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లి దండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఐఎల్‌టీడీ కంపెనీ మేనేజర్ శ్యాంసుందర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యనభ్యసించి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం రాత్రి స్థానిక సప్తగిరి లాడ్జిలోని ఏసీ కల్యాణ మండపంలో దివి శేషవాణి జ్ఞాపకార్థం ప్రత్యేక బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యనభ్యసించి 593 మార్కులు సాధించిన ఆర్. ఇషాంత్, 585 మార్కులు సాధించిన ఐ. రిషిత, 586 మార్కులు సాధించిన భీమవరానికి చెందిన పోలిశెట్టి మౌనిక కనకవర్షిణి, 575 మార్కులు సాధించిన దివి రిషిత, కస్తూర్బా గాంధీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన కామిశెట్టి శైలజ మాధురి 581 మార్కులు, 571 మార్కులు సాధించిన షేక్ అఫ్రిన్ అలానే పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్లో విద్యనభ్యసించి అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల తల్లి దండ్రులను కూడా సత్కరించారు. దివి పాండురంగారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి వడలి రాధాకృష్ణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ కబీర్, పాండురంగారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాజ్యోతిని వెలిగించి ఆటలు ప్రారంభిస్తున్న దృశ్యం

మార్టూరు: బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్టూరు మండలం కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీరాల డివిజన్ స్థాయి ఆటల పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. 13 మండలాల నుంచి 550 మందికి పైగా విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో అండర్ 17 బాలికల విభాగంలో మార్టూరు మండలం రన్నర్స్‌గా.. బల్లికురవ మండలం విన్నర్స్‌గా నిలిచారు. ఖోఖో అండర్ 17 బాలుర విభాగంలో జె. పంగులూరు మండలం విన్నర్స్‌గా.. మార్టూరు మండలం రన్నర్లుగా నిలిచారు. ఖోఖో అండర్ 14 బాలికల విభాగంలో మార్టూరు మండలం విన్నర్లుగా.. సంతమాగులూరు మండలం రన్నర్లుగా గెలిచారు. వాలీబాల్ అండర్ 17 బాలికల విభాగంలో వేటపాలెం మండలం విన్నర్స్‌గాను బల్లికురం మండలం రన్నర్లుగా నిలిచారు. వాలీబాల్ అండర్ 14 బాలికల విభాగంలో వేటపాలెం మండలం విన్నర్స్‌గా.. జె. పంగులూరు మండలం విజేతలుగా నిలిచారు. అనంతరం డివిజన్ స్థాయి ఖోఖో, వాలీబాల్, టీంలను ఎంపిక చేశారు. ముందుగా కోలలపూడి సర్పంచ్ సతీష్ కుమార్ పాఠశాల క్రీడాజ్యోతిని వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. విజేతలైన క్రీడాకారులకు హైకోర్టు అడ్వకేట్ ఎడవల్లి రమేష్, తాటివారిపాలెం సర్పంచ్ చిలి వేరి సుబ్బారావు, మద్దినీడి అంకమ్మరావు ట్రోఫీలు మెడల్స్ అందజేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

మార్టూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భుక్యా శాంతి బాయి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో మండలంలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

చీరాల రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎంపీ చిమటా సాంబు ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉన్నారని చెప్పారు. టీడీపీ.. బీసీల పార్టీ అని చెప్పుకునే చంద్రబాబు చిత్తశుద్ధి చూపి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించారు. చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్‌లు లేక బీసీలు నష్టపోతున్నారని.. కనీసం స్థానిక సంస్థల్లో అయినా కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఇది ప్రభుత్వ కార్యాలయమే..



కార్యాలయానికి వెళ్లే వీలులేకుండా కారును పార్కింగ్ చేసిన దృశ్యం

చీరాల టౌన్: చీరాల మండల పరిషత్ కార్యాలయంలోకి వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కారణం మండల పరిషత్ అభివృద్ధి అధికారి తన కారును దర్జాగా కార్యాలయం మెట్ల ముందు పార్కింగ్ చేయడమే. దీంతో కార్యాలయంలో వెళ్లేందుకు మెట్లు ఎక్కే వీలులేకపోవడంతో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపుపై వెళ్తున్నారు. బాధ్యతాయుతమైన మండల అధికారి తన కారును దర్జాగా కార్యాలయం ముందు పార్కింగ్ చేయడం ఎంతవరకు సబబు అని ప్రజలు విమర్శిస్తున్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ సోమల నాయక్

మేదరమెట్ల: హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను నియంత్రించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా క్షయ ఎయిడ్స్.. టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ బి.సోమలనాయక్ అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో గల హెల్ప్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కొత్తగా సెక్స్ వృత్తిలోకి వస్తున్న వారిని గుర్తించి వారికి ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అందిస్తున్న వైద్యసేవలను వివరించాలన్నారు. కండోం వినియోగంపై అవగాహన కల్పించాలని, క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. దిషా క్లస్టర్ ప్రోగ్రాం ఆఫీసర్ సయ్యద్ జానీ, హెల్ప్ టీఐ ప్రాజెక్టర్ బీవీసాగర్, ప్రోగ్రాం మేనేజర్ దుర్గా సురేంద్ర, కృష్ణవేణి, దుర్గా భవాని, హరిత, రాధమ్మ పాల్గొన్నారు.

ఘనంగా అట్లతద్దె వేడుకలు

కారంచేడు: తెలుగువారి ముఖ్యమైన పండగల్లో ఒకటైన అట్లతద్దె వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు, స్వర్ణ, ఆదిపూడి, కుంకలమర్రు, కొడవలివారిపాలెం గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వయుజ బహుళ తదియ పురస్కరించుకొని నిర్వహించే ఈ వేడుకల్లో గ్రామంలోని మోడల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఊయలలతో ఆటలాడుకున్నారు. హెచ్ఎం సరోజిని, పద్మావతి పండగ విశిష్టత వివరించారు.